

ప్రజాపాలన వెలుగులు

జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, చౌరస్తాలు, పట్టణ కూడళ్లలో విద్యుత్ లైట్లతో అలంకరించారు. శనివారం రాత్రి తాండూరు మునిసిపాలిటీ కార్యాలయం విద్యుత్ కాంతుల్లో ధగధగలాడుతోంది. ఇందిరాచౌక్, ఐల్యాండ్ చుట్టూ విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు.

- తాండూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి)

పిల్లలకు బూస్టర్ డోస్ వేయాలి

డీఎంహెచ్‌వో వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకటరమణ

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 నెలలు, 5, 10, 16 ఏళ్లలోపు పిల్లలకు బూస్టర్ (జేఈ, డీపీటీ) డోసులు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్యా, ఆరోగ్య కార్యాలయంలో వైద్య ఆరోగ్య కేంద్రాల అధికారులు, పర్యవేక్షకులకు టీకాల వేయడంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రతి ఆరోగ్య కేంద్రంలో టీకాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. టీకా తరువాత తల్లిదండ్రులకు చిన్నారుల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. టీకా అనంతరం తదుపరి తేదీని తెలిపే డాటాను ఆన్‌లైన్‌లో ఆప్డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీహెచ్‌వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్ల నిరసన

నిలిచిన బస్సులు.. ప్రయాణికుల ఇబ్బందులు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు

పరిగి,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తమ భద్రత లేదని ఆర్టీసీలోని ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు శనివారం పరిగి డిపోలో ఆందోళనకు దిగారు. కొందుర్గులో డ్రైవర్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ విధులను బహిష్కరించారు. దీంతో పరిగి డిపోలో 38 ప్రైవేట్ బస్సులు నిలిచిపోయాయి. మరో 20 బస్సులు మహబూబ్‌నగర్‌లోని రైతు సదస్సుకు వెళ్లాయి. పరిగి బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు బస్సుల కోసం నానా ఇబ్బందులు పడ్డారు. డీఎం కరుణశ్రీ, అసిస్టెంట్ మేనేజర్ సోమ్లాలు అక్కడికి చేరుకుని డ్రైవర్లను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా వినిపించుకోలేదు. కొందర్గు డ్రైవర్ దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టించామని, ఆర్టీసీ తరఫున భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఉదయం 11 గంటల తర్వాత బస్సులు కదిలాయి.

Sunday Special

మజారే మల్లారి

ఒగ్గు కళాకారిణిగా ప్రసిద్ధి

ఆమె జీవితమంతా డోలు, తాళాల చప్పుళ్లే. డిల్లెం బల్లెం పాటలు లేకుండా ఆమె రోజు ప్రారంభమయ్యేది కాదు. పుట్టిన నాటి నుంచే ఒగ్గు కథలు వింటూ పెరిగింది. తన తండ్రి పేరొం దిన కళాకారుడు కావడంతో ఆయనతో పాటు కథలు చెప్పేందుకు వెళ్లేది. చిన్న వయసులోనే శ్రీశైలం మల్లన్నను పెళ్లి చేసుకొని జీవితాన్ని ఆ దేవుడికే అంకితం చేసింది. మగవారిలా దుస్తులు ధరించి కథ చెప్పడం ప్రారంభిస్తే జనం తండోపతండాలుగా రావాల్సిందే. ఇంటిముందే తన తండ్రి సమాధిని నిర్మించుకున్న మేడిపల్లికి చెందిన ప్రముఖ కళాకారిణి జమ్మ మల్లారి ఒగ్గుకథా జీవితంపై ప్రత్యేక కథనం. ఆమె మాటల్లోనే..



సూర్యుడికి బతుకమ్మ తీయిస్తున్న మల్లారి (ఫైల్)



డోలు వాయిస్తూ ఒగ్గుకథ చెబుతున్న మల్లారి

- పదిహేనేళ్లకే దేవదేవుడితో వివాహం
- జీవితమంతా డిల్లెంబల్లెం పాటలే
- ఇంటి ముందే తండ్రి సమాధి నిర్మాణం
- బీరప్ప మల్లన్న కథ చెప్పాలంటే ఆమె ఉండాల్సిందే
- వేషం కట్టిందంటే కథ రక్తి కట్టాల్సిందే
- మేడిపల్లికి చెందిన ఒగ్గుకళాకారిణి ప్రత్యేకం

యాచారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మా ఊరు యాచారం మండలం మేడిపల్లి గ్రామం. నా తండ్రి జమ్మ గుండాలు, తల్లి చెన్నమ్మ. నాకు ఒక అక్క, అన్నతో పాటు ఐదు మంది చెల్లెళ్లు ఉన్నారు. నేను నా తల్లదండ్రులకు మూడో సంతానం. నేను చంటిపాపగా ఉన్నప్పుడు మూడు రోజుల పాటు నా తల్లి వద్ద పాలు తాగలేదని, ఆ సమయంలో నేను ఆరోగ్యంగా ఉంటే ఆ దేవుడికే ఇచ్చి పెళ్లి చేస్తానని నా తండ్రి శ్రీశైలం మల్లికార్జునస్వామి వారికి మొక్కాడు. దాంతో నా ఆరోగ్యం కుదుటపడి కొన్ని గంటల వ్యవధిలో నా తల్లి వద్ద పాలు తాగానని నా తండ్రి చెప్పారు. నాకు పదిహేనేళ్ల వయసు ఉన్నపుడు మా అన్న.. బీరయ్య వివాహం జరిగింది. ఆ సమయంలో

- మిగతా 7వ పేజీలో...

మా నాన్న మాతోనే ఉండేలా



ఇంటి ఎదుట మల్లారి తండ్రి సమాధి

నా తండ్రి బతికి ఉన్నప్పటి నుంచి ఈ ఇల్లు పెంకుటిల్లుగా ఉండేది. ఆనాడే ఈ ఇంటిని దేవుడి గుడిగా పిలిచేవారం. నా తండ్రి మృతి చెందిన సమయంలో అంత్యక్రియలు శ్మశానవాటికలో వద్దని ఇంటి ఎదుటే సమాధి నిర్మించాలని ఆనాడు గ్రామపెద్దలు చెప్పారు. దాంతో పాటు మాకు కూడా మా తండ్రి మా వెంటే ఉండాలని భావించి ఇక్కడే బొందపెట్టి సమాధి నిర్మించుకున్నాం. అనంతరం నా అన్న కొడుకును నా తండ్రి పేరైన జమ్మ గుండాలుగా పిలుచుకున్నాం.

అన్నం ముద్ద దిగడం లేదు

- ముద్దగా మధ్యాహ్న భోజనం
- ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకున్న విద్యార్థినులు



బాక్సులు తెచ్చుకున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ముద్ద దిగడం లేదు. దీంతో పలు పాఠశాలల్లోని విద్యార్థులు ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు వెంట తెచ్చుకుని తింటున్నారు. శనివారం బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)ను తహసీల్దార్ వెంకటేష్ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న విద్యార్థినుల వద్దకు వెళ్లారు. కొందరు విద్యార్థినులు టిఫిన్ బాక్సుల్లో అన్నం తింటూ కనిపించారు. ఇదేమిటి పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తినడం లేదా అంటూ వారిని ప్రశ్నించారు. అన్నం మెత్తగా ఉండటంతో రుచిగా లేక ముద్ద దిగడం లేదని బిక్కముఖం వేస్తూ చెప్పకనే చెప్పుకొచ్చారు. దీంతో అక్కడే ఉన్న జీహెచ్‌ఎం హీర్యానాయక్‌ను తహసీల్దార్ ఆరా తీశారు. అన్నం ముద్దగా ఉండటం వాస్తవమేనని, ఇటీవల సివిల్ సప్లై అధికారులు వస్తే తెలపడం జరిగిందన్నారు. బియ్యం వాపసు తీసుకెళ్లి కొత్త బియ్యం పంపిస్తామని చెప్పి ఇప్పటి వరకు పంపపించలేదని తహసీల్దార్‌కు వివరించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులందరూ మధ్యాహ్నం భోజనం తినేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు తహసీల్దార్ సూచించారు.

పీఎస్‌కొచ్చే వారికి గౌరవమివ్వాలి

- అంకితభావంతో విధులు నిర్వర్తించాలి
- జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తేవాలి
- ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరం
- ఎస్పీ నారాయణరెడ్డి

7

ధాన్యాన్ని వ్యాపారులకమ్మేందుకే రైతుల ఆసక్తి

- కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలతో ఇబ్బందులు
- తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్న అన్నదాతలు
- ఓపీఎంతో నిర్వాహకులకు తప్పని ఇబ్బందులు

7

చాపకింద నీరులా..

జిల్లాల్లో విస్తరిస్తున్న ఎయిడ్స్

- కేసులు పెరుగుతున్నాయ్!
- అవగాహన పెరిగినా..

మరింత జాగ్రత్త అవసరం



నేడు ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినం

వికారాబాద్ /మేడ్చల్ ప్రతినిధి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ప్రాణాంతకంగా మారిన హెచ్ఐవీ (ఎయిడ్స్)పై ప్రజల్లో అవగాహన పెరిగింది. హెచ్ఐవీ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నా వివిధ కారణాలతో కొందరు హెచ్ఐవీ బారిన పడుతూనే ఉన్నారు. వికారాబాద్ జిల్లాలో హెచ్ఐవీ బారిన పడుతున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో హెచ్ఐవీ బారిన పడ్డ వారు ఇప్పటి వరకు 6,776 మంది నమోదు చేసుకోగా, వారిలో 3,588 మంది చికిత్స తీసుకుంటున్నారు. చికిత్స తీసుకుంటున్న వారిలో 1,478 మంది పురుషులు, 1,997 మంది మహిళలు, ఆరుగురు ఇతరులు, 54 మంది మగ పిల్లలు, 53 మంది ఆడ పిల్లలు ఉన్నారు. మూడేళ్లలో జిల్లాలో హెచ్ఐవీ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. మేడ్చల్ జిల్లాలో కూడా హెచ్ఐవీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. 18-35 ఏళ్లలోపు వారే అధికంగా ఉన్నారు. వీరిలో మహిళల సంఖ్య పురుషుల కంటే ఎక్కువగా ఉన్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో పారిశ్రామికవాడలు, ఇటుకబట్టీలు, లేబర్అడ్డాలు, ట్రాన్స్‌పోర్టు గోదాములు పెద్దఎత్తున ఉన్నాయి. ఇక్కడ పని చేసే లేబర్లు అత్యధికంగా హెచ్ఐవీ బారిన పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. కాగా ప్రైవేటు ఆసుపత్రిల్లో పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు పొందుతున్న వారు చాలా వరకు ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

హెచ్ఐవీ కేసుల వివరాలు

సంవత్సరం (నవంబరు వరకు)	వికారాబాద్	మేడ్చల్
	జిల్లాల్లో నమోదైన కేసులు	
2021-22	377	49
2022-23	449	61
2023-24	456	51

ఏఆర్‌టీ కేంద్రాల్లో..

పదేళ్ల కిందట హెచ్ఐవీ బారిన పడ్డ వారిలో ఎక్కువ శాతం చికిత్స తీసుకునేందుకు ముందుకు వచ్చేవారు కాదు. హెచ్ఐవీ బారిన పడితే మరణం తప్ప బతుకు లేదని భావించేవారు. అయితే హెచ్ఐవీ వైరస్ తీవ్రతను తగ్గించే మందులు అందుబాటులోకి రావడం, ప్రజల్లో పెరిగిన అవగాహనతో హెచ్ఐవీ మరణాలు చాలా వరకు తగ్గాయి. తాండూరు, వికారాబాద్‌లలో ఏర్పాటు చేసిన ఏఆర్‌టీ కేంద్రాల్లో హెచ్ఐవీ రోగులకు చికిత్స అందిస్తున్నారు. అంతే కాకుండా హెచ్ఐవీ

- మిగతా 8వ పేజీలో..

దామగుండం ఫారెస్ట్‌లో సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్



పూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పూడూరు మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతాన్ని సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్ అధికారుల బృందం పరిశీలించింది. అక్కడ నేవీ రాడార్ కేంద్రం అధికారులు చేపడుతున్న పనులను పరిశీలించారు. అటవికి ఎలాంటి నష్టం జరగకుండా పనులు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అడవిలో చెట్లకు, జీవరాశులకు ఎలాంటి హాని జరుగలేదని అక్కడి అధికారులు తెలిపారు. ముున్ముందు మంటలు చెలరేగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీసీఎఫ్ వెంట డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ఎఫ్ఆర్‌వో అరుణ తదితరులున్నారు.

కేటీఆర్, హరీశ్‌రావులవి

జూటా మాటలు



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్


- ప్రజలను మోసం చేస్తున్నారు
- రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించాం
- గ్యారంటీల అమలుకు సీఎం, మంత్రులు కష్టపడుతున్నారు
- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు/వికారాబాద్ నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కేటీఆర్, హరీశ్‌రావులు జూటామాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని, రైతు రుణమాఫీతో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని, తెలంగాణలో 22 లక్షల మంది రైతులకు 18వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. వికారాబాద్ జిల్లా, ధారూరు మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో శనివారం ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం లో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల అమలుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని, డిసెంబరు 9 నాటికి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని అన్నారు. రైతుల అభిప్రాయాలను గౌరవించి లగచర్లలో ఫార్మా కారిడార్ విలేజ్ నిర్ణయాన్ని ఉప సంహరించుకున్నారని చెప్పారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా వికారాబాద్ జిల్లాకుసాగునీరు తీసుకువస్తానని అన్నారు. ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు .అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు గజమాలతో స్పీకర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ చెర్మన్ కె.విజయభాస్కర్ రెడ్డి, వైస్‌చైర్మెన్ ఆశోక్ ముదిరాజ్, డైరెక్టర్లను స్పీకర్‌తో పాటు పలువురు శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐసీసీ సభ్యుడు, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. సంతోష్‌కుమార్, పీసీసీప్రధాన కార్యదర్శి పి.రఘువీరా రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, ఫాక్స్ చైర్మెన్ వై.సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జి.మల్లారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, గఫార్, బుజ్జయ్య గౌడ్, రమేశ్ కృష్ణ, బాబాఖాన్ పాల్గొన్నారు. అలాగే రాజకీయాల కంటే ముందు సొంతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ది వికారాబాద్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహావీర్ వైద్య కళాశాల వైద్య బృందం క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్యాక్ పేరుతో సొంతంగా ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు అవసరమైన సహాయం అందిస్తున్నామన్నారు. వికారాబాద్ మెడికల్ కళాశాల నిర్మాణం వేగంగా జరుగుతుందని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకట రవణ, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, వికారాబాద్ క్లబ్ అధ్యక్షుడు లవకుమార్, నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

99.4%

సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

- కొనసాగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియ



యాలాల డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్ ప్రతినిధి/తాండూరు రూరల్/యాలాల నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో తుది దశకు చేరుకుంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచారం సేకరించేందుకు నిర్వహిస్తున్న సర్వే జిల్లాలో 99.4 శాతం పూర్తయింది. జిల్లాలో 2,83,728 కుటుంబాలు ఉండగా, శనివారం వరకు 2,79,303 కుటుంబాల సమాచారం సేకరించారు. సర్వే ప్రక్రియ ఈనెల 6వ తేదీన ప్రారంభించగా, మొదటి మూడు రోజులు ఇంటింటికీ స్టిక్కరింగ్ చేసే పనులు చేపట్టారు. 6వ తేదీ నుంచి ఇన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబాల సమాచారం సేకరించే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగింది. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో శత శాతం సర్వే పూర్తి కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోంది. మునిసిపాలిటీల పరిధిలో 44,538 కుటుంబాలు ఉండగా, 44,478 కుటుంబాల సమాచారం సేకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,39,190 కుటుంబాలు ఉండగా, ఇంతవరకు 2,34,825 కుటుంబాల సమాచారం సేకరించారు. ఇంకా 4,365కుటుంబాల సమాచారం సేకరించాల్సి ఉంది. దౌల్తాబాద్ మండలంలో వంద శాతం, మోమిన్‌పేట్‌లో వంద, ధారూరులో 102.1, తాండూరులో 102.2, బంట్వారంలో 103.3, కోట్‌పల్లిలో 103.6 శాతం సర్వే పూర్తి చేశారు. వికారాబాద్ మండలంలో 92.3 శాతం సర్వే పూర్తి కాగా, దుద్యాల్‌లో 95.9, బషీరాబాద్‌లో 97.6, పరిగిలో 98.2, మర్పల్లిలో 98.4, పూడూరులో 98.4 శాతం పూర్తయింది. కొడంగల్‌లో 98.5, బొంరాస్‌పేట్‌లో 98.8, చౌడాపూర్‌లో 98.9,

- మిగతా 8వ పేజీలో..

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు శనివారం నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, యాదాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో చలి కాస్త తగ్గింది. గత వారం రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరుగుతుండగా శుక్రవారం రాత్రి మాత్రం ఏకంగా ఐదారు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి.

క్షిపణుల తయారీలో భారత్ నంబర్ వన్

సాంకేతిక ప్రగతి, డీఆర్డీవోకు సహకారంలో నిట్ పాత్ర కీలకం

వరంగల్ నిట్ స్నాతకోత్సవంలో డీఆర్‌డీవో చైర్మన్ కామత్

హనుమకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): క్షిపణుల తయారీ రంగంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, సరికొత్త ఆవిష్కరణలతో మన రక్షణ విభాగం అత్యంత శక్తిమంతంగా మారిందని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వీ కామత్ అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో 22వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో మొట్టమొదటి ప్రాంతీ య ఇంజనీరింగ్ కాలేజీ స్థాయి నుంచి జాతీయ సాంకేతిక కళాశాలగా ఎదిగిన వరంగల్ నిట్ ప్రస్థానం అద్వితీయమని కొనియాడారు. అత్యున్నత విద్యా ప్రమాణాలను అందించడం, ఆవిష్కరణలకు జీవం పోయడం, నూతన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం ద్వారా నిట్ తన ప్రస్థానాన్ని విప్లవాత్మకంగా సాగిస్తోందన్నారు. దేశాభివృద్ధిలో, సాంకేతిక ప్రగతిలో, డీఆర్‌డీవోకు సహకారం అందించడంలో నిట్ క్రియాశీల భూమిక పోషించిందన్నారు. అగ్ని, పృథ్వీ, ఆకాశ్ వంటి క్షిపణులు, తేలికపాటి యుద్ధవిమానాలు, యుద్ధ ట్యాంక్ అర్జున్, రాకెట్ లాంచర్ పినాకలాంటి సాయుధ సంపత్తిని డీఆర్‌డీవోనే తయారు చేసిందన్నారు. వీటన్నింటి వల్లనే దేశ రక్షణ రంగం అత్యంత శక్తివంతమైందిగా నిలిచిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త అంశాలను నేర్చుకుంటూ ఉండాలని చెప్పారు. అంతకు ముందు కామత్ నిట్‌లో ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ స్నాతకోత్సవానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ అధ్యక్షత వహించారు. నిట్ సాధించిన ప్రగతిని వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 1,875 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో 10మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సారి నిట్ గోల్డ్ మెడల్ విజేతగా మంజిమా కర్మాకర్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) నిలిచారు.

సరూర్‌నగర్ స్టేడియంలో 6న బీజేపీ భారీ సభ

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక?
బీఆర్ఎస్ నోటిఫికేషన్లకు కాంగ్రెస్ కొలువులు
ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు
బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ పాలన: కిషన్‌రెడ్డి
సర్కారు వైఫల్యాలపై నేటి నుంచి నిరసనలు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 6న సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై ఆదివారం నుంచి బీజేపీ నిరసన కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుపై ఆదివారం చార్జ్‌షీట్ విడుదల చేయనుంది. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుంది. 2, 3, 4 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహించనున్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చింది తప్ప.. ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పంచాయతీలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కారులు ఒక్క పైసా ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ కూడా అరకొరగా చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోని అహంకారం, నియంతృత్వం, అవినీతి, వైఫల్యాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఏ వర్గమూ సంతోషంగా లేదని.. రాష్ట్ర ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమబాట పట్టాలని పార్టీ నాయకులకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని, కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగట్టాలని ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు.



రూ.26 కోట్లతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రైల్వేస్టేషన్ ప్రతిపాదిత డిజైన్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కల్పన వల్ల రైల్వే స్టేషన్ అత్యాధునిక రవాణా కేంద్రంగా మారుతుందని తెలిపారు.

సభ్యత్వ నమోదుపై బన్సల్ క్లాస్..

బీజేపీ క్రియాశీల సభ్యత్వంపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 20వేల క్రియాశీల సభ్యత్వాలు అయ్యాయని.. ఇంకా 30 వేలు చేయించాల్సిందేనని స్పష్టం చేశారు. సభ్యత్వాలు చేయించని వారికి పార్టీ పదవులు ఎందుకని ప్రశ్నించారు. "సభ్యత్వ నమోదు మొదలు ప్రతీ పార్టీ కార్యక్రమాలకు తెలంగాణ నేతలు సడలింపులు కోరతారు. యూపీ కంటే ఇక్కడ కులపిచ్చి ఎక్కువ. అధికారంలోకి రావాలంటే సంస్థాగత బలోపేతం అత్యంత కీలకం. హరియాణా, మహారాష్ట్ర రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం" అని స్పష్టం చేశారు.



వైసీపీ నేతల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లు

పులివెందుల వైసీపీ నేతల చెరవీడిన తెలంగాణ కార్లు

- ఏపీ మంత్రి లోకేష్ చొరవ.. సంగారెడ్డి వాసి సతీష్‌కు ఊరట
- ఇతడి సంస్థ నుంచి లీజుకు తీసుకున్న వికారాబాద్ వాసి
- అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులకు బాడుగకు
- సతీష్‌కు అద్దె చెల్లించని వికారాబాద్ యువకుడు మణిరాజ్
- అడిగినందుకు చంపేస్తామని బెదిరింపులు.. చిత్రహింసలు
- ఏపీ ఆదేశాలతో స్వాధీనం చేసుకున్న తెలంగాణ పోలీసులు



బాధితుడు సతీష్‌కుమార్

సంగారెడ్డి క్రైం, నవంబరు 30: గత మూడేళ్లుగా పులివెందుల వైసీపీ నాయకుల చెరలో ఉన్న తెలంగాణ వ్యక్తికి చెందిన ఆరు కార్లకు ఏపీ మంత్రి నారా లోకేష్ చొరవతో మోక్షం లభించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సతీష్‌కుమార్ హరిహర కార్ రెంటల్ పేరిట సంస్థను నడుపుతున్నాడు. వికారాబాద్ వాసి మణిరాజ్ 2021 ఏప్రిల్‌లో ఆరు కార్లను అద్దెకు తీసుకున్నాడు. 4 నెలల పాటు డబ్బు చెల్లించలేదు. ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో 2023 జనవరిలో సతీష్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మణిరాజ్‌ను ఓ మోసం కేసులో సైబరాబాద్ పరిధి జీడిమెట్ల పోలీసులు నిరుడు జూలై 5న అరెస్ట్ చేశారు. సతీష్ ఫిర్యాదుతో పీటీ వారెంట్‌పై సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను తీసుకున్న కార్లలో కొన్ని పులివెందుల వైద్య కళాశాలలో లీజుకు నడుస్తున్నాయని, మరికొన్ని వైసీపీ నేతల వద్ద ఉన్నాయని మణిరాజ్ తెలిపాడు. దీంతో సతీష్ వాహనాల గురించి వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వైసీపీ నేతలతో మాట్లాడుదామని వేంపల్లె పోలీసులు తీసుకెళ్లగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులు వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, వైసీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిలు సతీష్‌ను తీవ్రంగా కొట్టారు. కార్లు అడిగితే చంపుతామని బెదిరించారు. ఇడుపులపాయలోని గదిలో ఐదు రోజులు బంధించి చిత్రహింసలు పెట్టారు. చంపేందుకు కుట్ర పన్నారు. ఏపీలో ప్రభుత్వం మారడంతో ఇటీవల సతీష్ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రులు, నేతలను కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. సోషల్ మీడియాలో ఏపీ మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లాడు. జనసేన నేతలకు కూడా తెలిపాడు. ఆయన ఆదేశాలతో ఏపీ పోలీసులు.. ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరుల వద్ద ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సంగారెడ్డి పట్టణ పోలీసులు వాటిని తీసుకువచ్చారు. కార్లను కోర్టులో ప్రవేశపెడతామని సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ శనివారం తెలిపారు. 2021 నుంచి ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు తన కార్లను దౌర్జన్యంగా వాడుకున్నారని సతీష్ చెప్పాడు. వేంపల్లె పోలీసులు గతంలో వైసీపీ నేతలకే మద్దతు పలికినట్లు ఆరోపించాడు. కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి వైసీపీ నేతల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, తన ప్రాణానికి ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. తనను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

2 నుంచి సాయంకాలం బీటెక్ తరగతులు ప్రారంభం

- జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయంకాలం బీటెక్‌లో ప్రవేశాలు పొందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు డిసెంబరు 2 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు సమాచారమిచ్చినట్లు చెప్పారు. ఈవెనింగ్ బీటెక్ అకడమిక్ క్యాలెండర్‌ను ఆయన శనివారం విడుదల చేశారు. వర్సిటీలోని మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ఈ ఏడాది నుంచి కొత్తగా ఈవెనింగ్ బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 4వరకు మొదటి సెమిస్టర్ కొనసాగుతుందని, సెకండ్ సెమిస్టర్ జూన్ 2న ప్రారంభమై అక్టోబరు 18తో ముగుస్తుందన్నారు. సాయంకాలం బీటెక్ రెండో సంవత్సరం తరగతులను 2025 నవంబరు 3 నుంచి ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

అప్పులు తీర్చలేక పత్తి రైతు ఆత్మహత్య

- సిరిసిల్ల జిల్లా జవారిపేటలో ఘటన

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు అధికమవడం, అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించక పత్తిరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేటకు చెందిన రైతు కోమటి నాగరాజు (49) తనకున్న 4 ఎకరాలతోపాటు మరో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ప్రతీ ఏటా నష్టం రావడానికి తోడు కుమార్తె వివాహం చేయడంతో దాదాపు రూ.15 లక్షల అప్పులయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మనోవేదనతో శనివారం పొలంలో పురుగు మందు తాగాడు. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.

పాఠశాలల బంద్ విజయవంతం



చేవెళ్లలో బడి నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

చేవెళ్ల/కందుకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల డివిజన్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైందని డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్, శ్రీనివాస్ తెలిపారు. చేవెళ్లలోని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులను బయటకు పంపి బంద్ చేయించాయి. వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మిడ్ డే మీల్స్ చార్జీలు పెంచాలన్నారు. నాణ్యత లేని మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారని, దీంతో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చరణ్‌గౌడ్, తేజ, చందు, సాయిగౌడ్, బన్నీ, అనిల్‌కుమార్, విష్ణు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. కందుకూరు మండలంలో విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ చేయించారు. ఫెడరేషన్ మండల నాయకులు వినోద్, సిద్ధులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, చరణ్, ఆకాష్, వేణు, సందీప్ పాల్గొన్నారు.

మామిడి పూత దశలో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి సురేష్

కందుకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మామిడి తోటలు పూత దశకొచ్చే సమయంలో రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడి పొందాలని జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ తెలిపారు. శనివారం కందుకూరు రైతు వేదికలో మండల ఉద్యాన అధికారి సౌమ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. సూచనలు ఇచ్చారు. మామిడి పూత సమయంలో వాతావరణం మేఘావృతమై, ఎండ తగలకు పూత ఎక్కువగా రాలుతుందని, పూత రాలకుండా ఉండాలంటే థైమిటోక్సం మూడు గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా మ్యాక్స్ మందునైనా స్ప్రే చేయాలన్నారు. అలాగే కూరగాయ పంటల్లో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ రసాయనిక ఎరువులను తగ్గిస్తూ, ఆర్గానిక్(సహజ) ఎరువులను వేయాలన్నారు. రైతులు ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని, ఈ తోటల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఐడీఏ శాస్త్రవేత్త శ్రీకృష్ణ, ఏవో కృష్ణమోహన్, ఏఈవోలు రాజు, మల్లేష్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

బుగ్గజాతరలో కామారెడ్డి ఎమ్మెల్యే పూజలు



బుగ్గరామంగేశ్వరుడికి పూజలు చేస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు

మంచాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా భాసిల్లుతున్న బుగ్గ క్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు చివరి దశకు చేరాయి. శనివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాట్పల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి బుగ్గజాతరలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవదేవుడిని వేడుకున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి, బి.ప్రతాప్, వి.వెంకట్‌రెడ్డి, బాషయ్య, పి.జంగయ్య, జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీశైలం, ఎం.వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, రమేష్, బిక్షపతి, డి.రమేష్, యాదగిరిరెడ్డి, చంద్రమౌళి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ నేత దండెం రాంరెడ్డి బుగ్గరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయనతో నాయకులు కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హాథీరాం, రాహుల్, అక్షయ్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చక్రపాణి, శేఖర్‌చారి, సాయి, పవన్‌గౌడ్, అఖిల్, రాంబుబు, మధు, సత్యనారాయణ, సందీప్ ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌కొచ్చే వారికి గౌరవమివ్వాలి

వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి



రిటైరవుతున్న ఎస్సై జయశంకర్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

వికారాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరికి సమాన గౌరవం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల పాసింగ్ ఔట్ పూర్తిచేసుకుని రిపోర్ట్ చేసిన కానిస్టేబుళ్లతో శనివారం సమావేశం నిర్వహించారు. వారితో ఎస్పీ మాట్లాడుతూ.. ట్రైనింగ్‌లో నేర్చుకున్న విధంగా విధులను అంకితభావం, క్రమశిక్షణతో నిర్వర్తించాలని సూచించారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, శారీరక ధృడత్వంపై నిత్యం దృష్టిపెట్టాలని, జిల్లాకు, రాష్ట్ర పోలీసు శాఖకు పేరు వచ్చేలా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో సివిల్ విభాగంలో 28 మంది, ఏఆర్ 66, కమ్యూకేషన్ 3 మొత్తం 97మంది రిపోర్ట్ చేశారన్నారు. కార్యక్రమంలో ఏవో జ్యోతిర్మణి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు చిరకాలం గుర్తుంటాయి

ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఎస్ఐ జయశంకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని శాలువా, జ్ఞాపికలతో జయశంకర్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పోలీసు శాఖలో విధులు నిర్వహించి ప్రజలకు సేవచేయడం దేవుడిచ్చిన వరం అని, రిటైరైన అధికారులు వారి శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్ని ప్రయోజనాలను వెంటనే అందిస్తామని తెలిపారు. ఉద్యోగ విమరణ పొందుతున్న ఇద్దరు అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్, డీపీవో సిబ్బంది, రిటైరవుతున్న అధికారులు కుటుంబీకులు పాల్గొన్నారు.

మజారే మల్లారి

(5వ పేజీ తరువాయి...)

మా ఇంట్లో శ్రీశైలం మల్లికార్జున స్వామి కల్యాణం జరిపించాం. నాకు కూడా అదే సమయంలో ఆ దేవుడితో పెళ్లి చేశారు. అప్పటి నుంచి నా జీవితం ఆ దేవదేవుడికే అంకితం ఇచ్చాను.

మా అన్న పెళ్లిలోనే దేవుడితో..

నాకు దేవుడితో వివాహం జరిగిన తర్వాత నుంచి నేను మగవారిలా దుస్తులు ధరించడం అలవాటు చేసుకున్నాను. చొక్కా, దోవతి కట్టుకోవడం అవర్చుకున్నాను. కేవలం ఒగ్గు కథలు చెప్పుతున్న సమయంలో స్త్రీ పాత్ర ఉంటే మాత్రమే మహిళా దుస్తులు ధరించాను. కథ చెప్పడం ముగియగానే దోవతికట్టి, చొక్కా తొడుక్కోవడం అలవాటైంది. ఓసారి నా తల్లిదండ్రులు పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ సమయంలో నాకు దేవుడితో పెళ్లి అయిపోయింది. అయనే దిక్కని పెళ్లి విషయం మరోసారి నావద్దకు తీసుకురావద్దని హెచ్చరించాను. దాంతో ఆనాటినుంచి పెళ్లి ప్రస్తావన తీసుకురాలేదు.

12 ఏళ్లు వచ్చే నాటికే..

చిన్ననాటి నుంచి నాతండ్రి వెంట గ్రామాలకు కథలు చెప్పేందుకెళ్లి డోలు వాయించడం, తాళాలు కొట్టడం నేర్చుకున్నాను. నాకు 12 ఏళ్లు వచ్చే సరికి బీరప్ప, మల్లన్న, మాందాత లాంటి దేవతల కథలు చెప్పడం అలవాటైంది. ఎక్కువగా మహంకాళీ, కామరాతి, సిరియాళ గౌరమ్మ వేశాలు వేశాను. ఒగ్గుకథలు చెబుతున్న సమయంలో స్త్రీ పాత్ర పోషించే సమయంలో స్త్రీలా చీరకట్టి, రవిక ధరించి ఒగ్గుకథలు చెప్పడంతో జనం ఎగబడి ఎంతో ఆసక్తితో వినేవారు. నేను కథ చెబుతున్నానని తెలిస్తే జనాలు తండోపతండాలుగా వచ్చేవారు. అలాగే నేను చాలా మందికి కథలు చెప్పడం నేర్పించాను. సుమారు నా వద్ద 15 మంది ఒగ్గుకథలు చెప్పడం నేర్చుకున్నారు. ఇందులోనూ చాలా మంది ఇప్పటికే చనిపోయారు. నా వద్ద కథలు నేర్చుకున్నవారు నేనంటే ఎంతో గౌరవిస్తారు.

ఆపదొస్తే దేవుడే దిక్కు

నేను అనారోగ్యంతో బాధపడితే మా చెల్లెలు ఎల్లమ్మ నా వద్దే ఉండి నా బాగోగులు చూసుకుంటుంది. నా చెల్లెళ్లతో పాటు అన్నాదమ్ముల్లు, వారి కుమారులు కూడా నా బాగోగులు చూసుకుంటారు. నాకు ఏ ఆపద వచ్చినా ఆ దేవదేవుడికి పూజ చేస్తాను. వయోభారం చేత కొంత కాలంగా ఒగ్గుకథలు కేవలం కూర్చొని చెబుతున్నాను. ఇప్పటికైనా ఎవరైనా నా వద్దకు వచ్చి దేవుడి పెళ్లి చేయాలని కోరితే వెళ్లి నాతోటి కళాకారులతో కలిసివెళ్లి అంగరంగ వైభవంగా దేవుడి పెళ్లి చేయిస్తాను.



దేవుడికి పూజలు చేస్తున్న మల్లారి



35 ఏళ్లక్రితం బీరప్ప పండగ సమయంలో ఒగ్గుకథ చెబుతున్న జమ్మ మల్లారి (నీలిరంగు చీరలో..)

పేద కళాకారులను ఆదుకోవాలి

రాష్ట్రంలో ఒగ్గు కళాకారులకు మంచి ఆదరణ ఉంది. నా కథలను విన్న ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాకు రూ.లక్ష నగదు అందించారు. ఆ డబ్బుతో పాటు కొంత ధనం పోగు చేసి రెండు గదులు నిర్మించుకున్నాను. అందులో ఒకటి దేవుడికి కేటాయించాను. నా తండ్రి ఉన్నప్పటినుంచి శివసత్తిగా మారడం మానేశాను. నేను శివసత్తిలా మారిన సమయంలో నాతండ్రి వద్దని వారించడంతో విరమించుకున్నాను. ఒగ్గు కళాకారులకు సామాజిక పింఛన్లు అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. 60ఏళ్లు నిండిన ఒగ్గు కళాకారులకు విధిగా పింఛన్ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఒ గ్గు కథలు చెప్పించాలి. అప్పుడు ఒగ్గుకథలతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్తాయి. అలా ప్రభుత్వ పథకాల గురించి కథల రూపంలో చెబితే తగిన పారితోషికం ఇచ్చి ఆదుకోవాలి. ఇల్లు లేని పేద ఒగ్గు కళాకారులకు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

మంచాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యం చెందారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. సీపీఎం మంచాల మండల 9వ మహాసభలు శనివారం లోయపల్లిలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాన్‌వెస్లీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ఏడాది కావస్తున్నా చేసిందేమీ లేదన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. పోరాటాలతో సాధించుకున్న కార్మిక, రైతు చట్టాలను బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. వామపక్షాలన్నీ వర్గపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మహాసభల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.యాదయ్య, జగదీష్, భాస్కర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, జంగయ్య, రాములు, పాపిరెడ్డి, స్వామి, రాజు, యూసుఫ్, జగన్, ఓ.భాస్కర్, ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

తాండూరు మీదుగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు



తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే అయ్యప్ప స్వాములకు శుభవార్త చెప్పింది. తాండూరు మీదుగా శబరిమలకు వెళ్లేందుకు ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. తాండూరు మీదుగా శబరిమలకు రెండురైళ్లను నడపనున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్ నుంచి కొట్టాయం(రైల్ నంబర్ 07135), కొట్టాయం నుంచి నాంపల్లికి(07136), అలాగే నగరంలోని మౌలాలి నుంచి కొల్లాంకు(07141), కొల్లాం నుంచి మౌలాలికి(07142) రైళ్లను నడపుతారు.

హైదరాబాద్-కొట్టాయం-హైదరాబాద్ స్పెషల్ ట్రైన్

తాండూరు మీదుగా కొట్టాయానికి పది రైలు సర్వీసులను నడపుతారు. 07135 నంబర్ రైలు బేగంపేట్, లింగంపల్లి, శంకర్‌పల్లి, వికారాబాద్ మీదుగా తాండూరుకు చేరుతుంది. ఈ రైలు కర్ణాటక, ఏపీలోని సేడం, యాద్గిర్, కృష్ణా, మంత్రాలయం, ఆదోని, గుంతకల్ తదితర స్టేషన్ల మీదుగా కొట్టాయం చేరుతుంది. తిరిగి కొట్టాయం(ట్రైన్ నం:07136)లో ప్రారంభమై ఇదే స్టేషన్ల మీదుగా హైదరాబాద్‌లోని నాంపల్లికి చేరుతుంది. ఈ రైలు హైదరాబాద్‌లో అర్ధరాత్రి 12గంటలకు ప్రారంభమై తాండూరుకు తెల్లవారు జామున 2:53గంటలకు చేరుకుని 2:55కు బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో కొట్టాయంలో సాయంత్రం 6:26గంటలకు ప్రారంభమై మరుసటి రోజు రాత్రి 11:23గంటలకు తాండూరు చేరుకుంటుంది. తాండూరు నుంచి ఈ రైలుకు స్లీపర్ కోచ్ టికెట్ ధర రూ.360గా నిర్ణయించారు. ఈ రైలు డిసెంబరు 3, 10, 17, 24, 31 తేదీల్లో నడుస్తుంది. ఇదే మార్గంలో మౌలాలీ-కొల్లాం-మౌలాలి సర్వీసు కూడా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలుకు అదనంగా చెంగనచేరి, తిరువల్ల, చెంగనూరు, కాయంకుళం స్టేషన్లలో హాల్టింగ్ ఉంది. 07141/07142 రెండు ప్రత్యేకరైళ్లు కూడా ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ భోగీలు ఉంటాయి.

భక్తులకు సమయం, డబ్బు ఆదా ..

తాండూరు నుంచి శబరిమలకు రైళ్లలో వెళ్లాలంటే గతంలో కర్ణాటకలోని వాడి, హైదరాబాద్‌లోని నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లకు వెళ్లేవారు. ప్రస్తుతం తాండూరు మీదుగా నూతనంగా రైలును ప్రవేశపెట్టడంతో అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమల వెళ్లేవారికి సమయం ఆదాతో పాటు టికెట్ ఖర్చులు కూడా తగ్గుతాయి. శబరిమలకు తాండూరు మీదుగా స్పెషల్ ట్రైన్లు వెళ్తుండడంతో అయ్యప్ప మాలధారులు, దర్శనానికి వెళ్లేవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



యాలాల ఎమ్మార్సీ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

యాలాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి వారిని క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం యాలాల విద్యావనరుల కేంద్రం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగులుగా 21సంవత్సరాలుగా పని చేస్తూ శ్రమదోపిడీకి గరవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్సీ, సీఆర్సీ, కేజీబీవీ, యూఆర్ఎస్, డీపీవో స్థాయిలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు వెంకటేశం, సీవో, సీఆర్పీలు శ్రీనివాస్, ఇస్మాయిల్, అమరేశ్వర్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని వ్యాపారులకు అమ్మేందుకే రైతుల ఆసక్తి

కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలతో ఇబ్బందులు



కులకచర్లలో వడ్లు అన్‌లోడింగ్ చేస్తున్న వ్యాపారి

పరిగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఏదోసాకు పెడుతుండటంతో చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకే ఆసక్తి చూపుతున్నారు. కులకచర్ల మండలంలో 9, చౌడాపూర్‌లో 7 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం సన్న వడ్లు ప్రతీ క్వింటాలుపై రూ.500 బోనస్ ఇస్తుండడంతో సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కాంటవేస్తున్నారు. ఇప్పటి వరకు తిరుమలాపూర్ కేంద్రానికి కేవలం ఒక్క లారీ సన్న వడ్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు తెలిపారు. తాలు, తేమ, మట్టి బెడ్డలు ఉన్నాయనే కారణాలు చూపుతూ కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కొనేందుకు కొర్రీలు పెడుతున్నాడు. తిరుమలాపూర్, ఇప్పాయిపల్లి, కుసుమ సముద్రం, పీరంపల్లి, కామునిపల్లి, ఘనపూర్ గ్రామాల రైతులు తమ వడ్లను కొనుగోలు కేంద్రాల్లో కాకుండా వ్యాపారులకు తక్కువ రేటుకు అమ్ముతున్నారు.

నిర్వాహకులకు తప్పని కష్టాలు

ఈ సారి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సైతం తిప్పలు తప్పడం లేదు. సన్నాలకు బోనస్ ఇస్తుండటంతో ప్రభుత్వం కొన్ని నిబంధనలను అమలుల్లోకి తెచ్చింది. సన్న రకం వడ్లు కొంటే ధాన్యం బ్యాగులపై రైతు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ రాయాల్సి ఉంటుంది. దీంతో ఎక్కడే పొరపాటు జరుగుతుందోనని ఒత్తిడికి గురవుతున్నారు. ఈ కారణంతో కేంద్రాల వద్ద కొనుగోళ్లు నెమ్మదిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

శుభకార్యాలే టార్గెట్‌గా చోరీలు

- ముఠాలోని ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఆదిభట్ల పోలీసులు
- 38 తులాల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం
- మరో ఇద్దరు నిందితుల పరార్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లు, శుభకార్యాలను ఎంచుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరిని శనివారం ఆదిభట్ల పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 38తులాల బంగారు ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు పరాయ్యారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వివరాలు వెల్లడించారు. నవంబరు 14న బ్రాహ్మణపల్లి ట్రాంకిల్ రిసార్ట్‌లో హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌కు చెందిన పారెపల్లి నర్సింహ, అనితల కూతురి వివాహమైంది. ఆ సమయంలో దొంగలు అనిత హ్యాండ్ బ్యాగ్‌ను దొంగిలించారు. అందులో 18తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు, ఓ సెల్‌ఫోన్ ఉన్నాయి. 15న నర్సింహ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు ఎస్.వెంకటేష్, కె.రాజు, నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుళ్లు ఉపేందర్‌రెడ్డి, సంతోష్, శివచంద్ర, కృష్ణ, రవీందర్, సందీప్‌లు మూడు టీంలుగా ఏర్పడి దొంగల కోసం గాలించారు. శనివారం హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవేపై బొంగులూరు ప్రమిద గార్డెన్ వద్ద నంబరు ప్లేట్‌లేని మారుతీ ఇగ్నిస్ కారును గుర్తించారు. పోలీసులను చూసి కారులో ఉన్న నలుగురిలో ఇద్దరు కారు దిగి పరారయ్యారు. అరుడ(38), మరో 12ఏళ్ల బాలుడు పట్టుబడ్డారు. కారులో 38తులాల బంగారు ఆభరణాలున్నాయి. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా నవంబరు 14న బ్రాహ్మణపల్లిలోని రిసార్టులో జరిగిన పెళ్లిలో 18 తులాల ఆభరణాలు, నగదు చోరీ చేశామని ఒప్పుకున్నారు. ఆ తర్వాత కర్ణాటకలోకి టిప్టూర్ పట్టణ పీఎస్ పరిధిలో మరో రెండు చోరీల్లో 20తులాల బంగారు ఆభరణాలు తస్కరించినట్టు తెలిపారు. నిందితులు మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘడ్ జిల్లా పిప్లరపొడ బొడా పోలీస్‌స్టేషన్ పరిధి గుల్ఖేడి, జల్‌ఖేడి గ్రామానికి చెందినవారుగా తేలింది. అరుడ, రిషి(19), అభిషేక్(25), 12ఏళ్ల బాలుడు ముఠాగా ఏర్పడి బంధువుల కారు కిరాయికి మాట్లాడుకున్నారు. ఈ నెల 10న వారి గ్రామం నుంచి బయల్దేరి 12న హైదరాబాద్ చేరుకున్నారు. నవంబరు 14న బ్రాహ్మణపల్లి ట్రాంకిల్ రిసార్ట్‌కు వచ్చారు. అభిషేక్ కారును బయట నిలిపి ఉండగా అరుడ, రిషి, 12ఏళ్ల బాలుడు రిసార్టు లోపలికెళ్లి బంధువుల వలె కూర్చున్నారు. బాలుడు పెళ్లి మండపం ముందు ఉన్న సోఫాలో కూర్చుని పెళ్లి కూతురు తల్లి అనిత బ్యాగ్‌ను కొట్టేశాడు. తిరిగి వీరంతా కారులో కర్ణటక వెళ్లి అక్కడా ఇదే రీతిలో రెండు ఫంక్షన్లలో బంగారు ఆభరణాలు చోరీ చేశామని ఒప్పుకున్నారు. ఇదిలా ఉంటే వీరిపై మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ ఏడు దొంగతనం కేసులు ఉన్నట్టు డీసీపీ తెలిపారు.

ఊరు ఊరంతా దొంగతనాలే వృత్తిగా..

ఎంపీలోని రాజ్‌గడ్ జిల్లా గుల్లేడి, జల్‌ఖేడి పక్కన ఉన్న మరో గ్రామంలోని అందరూ దొంగతనాలే వృత్తిగా ముఠాగా ఏర్పడి ఇతర రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. వీరి గ్రామంలోకి బయటవారు, పోలీసులుగానీ వస్తే దాడులకు కూడా తెగబడతారని చెప్పారు. అక్కడ విచిరణకు వెళ్తే రాజ్‌గడ్ పోలీసులను తీసుకునే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ దొంగల ముఠాలో రిషి, అభిషేక్ అన్నదమ్ములని తెలిపారు. కాగా ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్సైలు, వారి టీం సభ్యులను డీసీపీ సునీతారెడ్డి అభినందించారు.

మెనూ ప్రకారం భోజనమందించాలి



పాఠశాలలో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

పెద్దేముల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మండలంలోని జనగాం ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. స్కూల్‌లో నిల్వ ఉన్న బియ్యం, వంట సామగ్రిని పరిశీలించారు. కిచన్ రూం శుభ్రంగా ఉందా.. లేదా? అని చూశారు. వంట వారు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. గిర్మాపూర్, జనగాం గ్రామాల్లో చేపట్టిన రోడ్డు పనులు నాణ్యతపై పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి సర్వే డాటా ఎంట్రీ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఎంట్రీలో తప్పులు లేకుండా కుటుంబ వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సుధీర్ సూచించారు.

సర్వే డాటా ఎంట్రీపై సీపీవో ఆరా



డాటా ఎంట్రీ వివరాలను తెలుసుకుంటున్న సౌమ్యామిశ్రా

ఆమనగల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీని వెంటనే పూర్తిచేయాలని జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్యామిశ్రా అధికారులను ఆదేశించారు. ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీని ఆమె పరిశీలించి ఎంట్రీలో ఏమైనా ఇబ్బందులొస్తున్నాయా? అని ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఎంపీడీవో కుసుమ మాధురితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో సర్వే వంద శాతం చేశామని ఎంపీడీవో తెలిపారు. ఆన్‌లైన్ డాటా ఎంట్రీ 80.6శాతం పూర్తయిందని చెప్పారు. ఎంట్రీ చేసిన ప్రతీ ఫామ్‌పై పూర్తయినట్లు స్టాంప్ వేస్తున్నామని సౌమ్యామిశ్రాకు వివరించారు. అనంతరం సీపీవో మాట్లాడుతూ ఆన్‌లైన్ డాటా ఎంట్రీ ఆదివారానికల్లా పూర్తిచేయాలని సూచించారు. డాటా ఎంట్రీ పూర్తయిన ఫారాలపై 'కంప్లీటెడ్' స్టాంప్ వేయడం అభినందనీయమని ఎంపీడీవోను అభినందించారు. డాటా ఎంట్రీల్లో తప్పుల్లేకుండా చూడాలని ఆపరేటర్లకు సూచించారు.

ముగిసిన ధాన్యం సేకరణ


ఎదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముగిసింది. జిల్లాలో ఘట్‌కేసర్ మండలం నుంచే అత్యధికంగా వరిధాన్యాన్ని సేకరిస్తారు. మండలంలో ఎదులాబాద్, మాదారంలో అక్టోబరు 18, ప్రతాప్‌సింగారంలో అక్టోబరు 25న డీసీఎంఎస్ (జిల్లా పౌరసరఫరాలశాఖ) ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాదారంలో 110 మంది రైతుల నుంచి 28,326(1133 మెట్రిక్ టన్నులు) బస్తాల ధాన్యం సేకరించి రూ.2,62,86,528లను చెల్లించారు. ఎదులాబాద్‌లో 201మంది రైతుల నుంచి 39,364 (1574 మెట్రిక్ టన్నులు) బస్తాలకు గానూ రూ.3,65,29,792లను చెల్లించారు. అదేవిధంగా ప్రతాప్‌సింగారంలో 45 మంది రైతుల నుంచి 6361 (254 మెట్రిక్ టన్నులు) బస్తాలను సేకరించి రూ.59,03,008లను చెల్లించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సుగుణబాయి, జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం తెలిపారు.

బీజేపీ సభ్యత్వంలో జిల్లాలో పరిగి ఫస్ట్

పరిగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వంలో జిల్లాలోనే పరిగిలో మొదటి స్థానంలో ఉందని బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నె ఈశ్వరప్ప అన్నారు. పరిగిలో శనివారం బీజేపీ సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వం చేసేందుకు ఇతర పార్టీల నుంచి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ పరిగి తాలూకా కన్వీనర్ విజయ్‌కుమార్, కులకచర్ల, దోమ మండలాల నాయకులు వెంకటేశ్, మహేశ్, అద్యక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీలపై అధికారుల అలసత్వం!

- ప్రతిపక్షాల బ్యానర్లు ఒక్కరోజులోనే తొలగింపు
- అనుమతులు లేకుండానే ఏర్పాటు
- మున్సిపల్ ఆదాయానికి గండి
- ఫ్లెక్సీల వ్యవహారంపై స్థానికంగా జోరుగా చర్చ


ఎన్టీఆర్ చౌరస్తాలో తొలగించిన దీక్షాదివస్ ఫ్లెక్సీ

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి జిల్లా అధికారులకు అంతులేని ప్రేమ చూపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పది సంవత్సరాల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆపార్టీకి కొమ్ముకాసిన అధికారులు ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి నిలువెత్తు సాక్ష్యం వికారాబాద్ పట్టణంలో వెలసిన ఫ్లెక్సీలనే చెబుతున్నారు. వికారాబాద్‌లో శుక్రవారం దీక్ష దివస్ కార్యక్రమం నిర్వహించగా తెల్లవారేసరికే వికారాబాద్‌లో మునిసిపల్ అధికారులు, సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారు. ఇదేతీరు కాంగ్రెస్ ఫ్లెక్సీల విషయంలో ఎందుకు వ్యవహరించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే బీఆర్ఎస్ నాయకులు ఏకంగా మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌ను సైతం ఇదే విషయంపై నిలదీశారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీల ఏర్పాటుతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు నిజాయితీగా పనిచేసి మునిసిపల్ ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సీసీఐ ఆధునికీకరణకు నిధులివ్వండి


ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తాండూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కరన్‌కోట్ సీసీఐ కర్మాగారం ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని కరన్‌కోట్ సీసీఐ కర్మాగారం ఉద్యోగులు శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సిమెంటు కర్మాగారంలో 50వేల మెట్రిక్ టన్నుల కింక్లర్ అందుబాటులో ఉండదని, సిమెంటు ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ పాత యాంత్రీకరణ కారణంగా మార్కెట్‌లో ప్రైవేటు ఫ్యాక్టరీలకు ధీటుగా ఉత్పత్తి సాధించలేకపోతున్నట్లు తెలిపారు. నూతన టెక్నాలజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసేలా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ద్వారా నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో సీసీఐ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బాల్‌శంకర్, వంశీకృష్ణ, సురేష్‌రెడ్డి, చైతన్య తదితరులున్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయాలి

కీసర రూరల్, నవంబర్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 1 నుంచి 9వరకు ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కొడంగల్: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డీపీఆర్‌వో చెన్నమ్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మండలంలోని రుద్రారం, అంగడిరైచూర్, హస్నాబాద్ గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు శనివారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెంకట్రాములు, అన్నుబాయి, అర్చన, శ్రీనివాసులు, బిక్షపతి, సంధ్య పాల్గొన్నారు.

నేడు యాలాలలో ఎమ్మెల్యే పర్యటన

యాలాల: మండలంలో నేడు(ఆదివారం) ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటించనున్నారు. ఏడాది ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కోకట్, రాఘవాపూర్, కమలాపూర్, నాగసముందర్, అన్నసాగర్, బాణాపూర్, అడాల్‌పూర్, రాస్నం, పగిడ్యాల్, భాగాయిపల్లి, అచ్యుతాపూర్, ముద్దాయిపేట్ పర్యటించనున్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

తాండూరు రూరల్/బషీరాబాద్/మర్పల్లి/యాలాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పౌరులందరినీ సమానంగా చూడాలని, వారి హక్కులకు భంగం కలిగించొద్దని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు. తాండూరు మండలం మల్కాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్‌ఐ విఠల్‌రెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. ఎంపీడీవో విశ్వప్రసాద్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. అదేవిధంగా బషీరాబాద్ మండలంలోని కుప్పన్‌కోట్‌లో తహసీల్దార్ వై.వెంకటేష్, ఎస్‌ఐ పి.శంకర్ ప్రజలు సమస్యలపై ఆరా తీశారు. మర్పల్లి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. మర్పల్లి హస్టల్ వార్డెన్ తుల్జారాం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు. యాలాల మండలంలోని నాగసముందర్‌లో ఎస్‌ఐ గిరి పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నతంలోనే తమ పిల్లలకు పెళ్లిళ్ల చేయడం నేరమన్నారు. నవాబుపేటలో తహసీల్దార్ జయరాం పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా మాదారం గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో అనురాధ, ఎంఈవో అబ్దుల్ రెహమాన్, మాజీ సర్పంచ్ అంజయ్య పాల్గొన్నారు.

భారతీయ పూర్వ విద్యావిధానం గొప్పది

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ పూర్వ విద్యావిధానం ఎంతో గొప్పదని, దాని మాదిరిగానే పతంజలి యోగ ట్రస్టు భారతీయ శిక్ష బోర్డును ఏర్పాటు చేసినట్లు జోనల్ ఇన్‌చార్జి వెంకట్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని రత్నారెడ్డి గార్డెన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భారతీయ పూర్వ విద్యా విధానాన్ని ఇతర దేశాలు పాటించేవని, అలాంటి విద్యా విధానాన్ని మళ్లీ నెలకొల్పనున్నట్లు తెలిపారు. మన ప్రాంతంలోని పాఠశాలలు ఈ బోర్డుకు అనుసంధానం చేసుకుంటే బాగుంటుందని పూర్తివివరాలకు తమను సంప్రదించాలని కోరారు. సీబీఎస్ మాదిరిగా పతంజలి ట్రస్ట్ బోధనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ చంద్ర ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి సదానంద్‌గౌడ్

కొడంగల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద్‌గౌడ్ అన్నారు. శనివారం కొడంగల్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులందరికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

99.4% సమగ్ర సర్వే పూర్తి

(5వ పేజీ తరువాయి)

యాలాల్‌లో 98.9, కులకచర్లలో 99.2, దోమలో 99.3, నవాబ్‌పేట్‌లో 99.6, పెద్దేముల్‌లో 99.8 శాతం సర్వే పూర్తయింది.

వేగంగా డాటా ఎంట్రీ ప్రక్రియ

ఇదిలా ఉంటే, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. జిల్లాలో 2,82,746 కుటుంబాలు ఉండగా, ఇప్పటి వరకు 70,637 కుటుంబాల సమాచారం ఎంట్రీ చేశారు. జిల్లాలో డేటా ఎంట్రీ ప్రక్రియ వికారాబాద్ మండలంలో 56.2 శాతం పూర్తి కాగా, బంట్వారంలో 43.4, తాండూరులో 42.8, కోట్‌పల్లిలో 41.3, బషీరాబాద్‌లో 39.4, నవాబ్‌పేట్‌లో 38.9, మోమిన్‌పేట్‌లో 37.5, పూడూరులో 27.0, దుద్యాల్‌లో 22.2, బొంరాస్‌పేట్‌లో 21.4, ధారూరులో 20.5, మర్పల్లిలో 20.4, పరిగిలో 19.5, దోమలో 19.4, దౌల్తాబాద్‌లో 19.2, కొడంగల్‌లో 19.2, కులకచర్లలో 18.8, పెద్దేముల్‌లో 14.3, చౌడాపూర్‌లో 14.1, యాలాల్‌లో 12.1 శాతం డేటా ఎంట్రీ పూర్తయింది. మునిసిపాలిటీల్లో తాండూరులో 10.5, వికారాబాద్‌లో 12.8, పరిగిలో 27.7, కొడంగల్‌లో 54.1 శాతం డేటా ఎంట్రీ పూర్తి చేశారు.

డాటా ఎంట్రీని వేగవంతం చేయాలి

సమగ్ర సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. శనివారం తాండూరు, యాలాల ఎంపీడీవో కార్యాలయాల్లో జరుగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో విశ్వప్రసాద్‌ను ఎంట్రీ ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో పుష్పలీల, ఎంపీవో యాదయ్య ఉన్నారు.

బీజేపీ పెద్దలను కలిసిన నేతలు


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాదవరెడ్డి, వడ్లనందు

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని బీజేపీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, దిశ కమిటీ చైర్మన్ వడ్లనందు, నాయకులు పోకల సతీష్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిద్దిదాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని టీజీసీఎస్‌సీ చైర్మన్ బుర్రా వెంకటేషం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్‌లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ ఆధ్వర్యంలో యువతకు డ్రగ్స్ నివారణపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్రగ్స్ బారినపడి అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించాడు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులు మల్లేష్, ఎం.శ్రీనివాస్‌రావు, పురుషోత్తం, నవీన్ పాల్గొన్నారు.

మైనార్టీల విదేశీ విద్యకు స్కాలర్‌షిప్

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకం కింద 2024 ఫాల్ సీజన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పేద మైనార్టీ విద్యార్థులకు రూ.20లక్షల స్కాలర్‌షిప్, రూ.60వేల విమాన ప్రయాణ ఖర్చులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ(ఇంజనీరింగ్)లో 60శాతం మార్కులతో పీజీ చేయాలనుకునే వారు, పీజీ 60శాతం మార్కులతో పీహెచ్‌డీ చేయాలనుకునే వారు ఆగస్టు నుంచి డిసెంబరు మధ్య కాలంలో విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన వారు అర్హులన్నారు. డిసెంబరు 1 నుంచి 31వరకు తెలంగాణ ఈ పాస్ ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్నారు. హార్డ్ కాపీలను జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం కలెక్టర్ కార్యాలయంలో డిసెంబరు 10 వరకు సమర్పించాలని సూచించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కీసర రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ.. శషాంక్ ఎన్‌క్లేవ్‌లో ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.5లక్షలు, పారిశుధ్య సామగ్రి కొనుగోలుకు రూ6.38లక్షలు, పారిశుధ్య వాహనాల రిపేరుకు రూ.5లక్షలు, కీసర ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మరమ్మతుల నిమిత్తం రూ.5లక్షలు, డీపీఆర్ సిద్ధం చేసేందుకు రూ.8లక్షలు, ఆయా వార్డుల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.29.38లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఈ సమావేశంలో కమిషనర్ నాగమణి ఉన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కీసర రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధి ఏడోవార్డు ప్రగతి ఎన్‌క్లేవ్‌లో రూ.7.50లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తాండూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తాండూరు తహసీల్దార్ విశ్వప్రసాద్ ఏజెన్సీ నిర్వహకులను ఆదేశించారు. మండలంలోని మల్కాపూర్ గని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఎస్ఐ విఠల్‌రెడ్డి, హెచ్ఎం బాబ్యానాయక్, విజయలక్ష్మీ, రవిసింధే, రఘునాథ్‌రెడ్డి, పండరి తదితరులున్నారు.

కులకచర్ల: విద్యార్థులకు మధ్యాహ్న బోజనంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రామకృష్ణ హెచ్చరించారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. పాడైన బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరా చేయించారు. పంచాయతీ కార్మికులతో హాస్టల్ చుట్టు ఉన్న చెత్తను తొలగింపజేశారు. పాఠశాలను శుభ్రం చేయించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూ డీఈ సుబ్రహ్మణ్యం, ఎంపీవో భాస్కర్‌గౌడ్, హాస్టల్ ఇన్‌చార్జి దేవి, వార్డెన్ కల్పన తదితరులు పాల్గొన్నారు.


కులకచర్ల: ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలలో బోరు మోటార్‌కు మరమ్మతులు చేయిస్తున్న ఎంపీడీవో

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో ఎంఏ కరీంలు అన్నారు. పరిగి మండలం చిట్యాల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

దోమ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో వెంకట్ సూచించారు. మండలంలోని దొంగ ఎన్కెపల్లి పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బియ్యం, కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించారు.

మర్పల్లి: వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏఎస్‌డబ్ల్యూవో శుక్లవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం, పట్లూర్ గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా, తమకు వేతనాలు రావడం లేదని ఔట్ సోర్సింగ్ సిబ్బంది వినతి పత్రం అందజేశారు.

వైభవంగా కోటి దీపోత్సవం


ఘట్‌కేసర్: కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల శ్రీ శివశంకరి వేదపీఠంలో కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాశీపీఠం పీఠాదీశ్వరులు పరమహంస పరివ్రాజకాచార్య శివనాంగేంద్ర సరస్వతీ గౌడపాదాచార్య స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కాశీపంతులు, కౌన్సిలర్లు బొక్క సంగీతా ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్ వెంకట్ రెడ్డి, స్థానికులు ప్రసాద్ పాల్గొన్నారు.

కార్తీకమాసం చివరిరోజు ప్రత్యేక పూజలు

ఘట్‌కేసర్ రూరల్: కార్తీక మాసం చివరిరోజు మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం భక్తులు శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఎదులాబాద్‌లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో తెల్లవారుజామున శివలింగానికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం మాజీ ఉప సర్పంచ్ ఉప్పు లింగేశ్వర్‌రావు సోదరులు భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం ప్రత్యేకపూజలు చేసి విరమించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కంట్లం గౌరిశంకర్, శివకుమార్, ఓంప్రకాష్, ఆలయ పూజారి శ్యామ్‌కుమార్, భక్తులు బింగి రాజేందర్‌గౌడ్, సాయికిరణ్, శ్రావణ్, రాజుగౌడ్, నాగులు పాల్గొన్నారు.


వికారాబాద్: పూజలో చైర్‌పర్సన్ మంజుల రమేష్

14 ఏళ్లుగా వికారాబాద్‌లో రుద్రాభిషేకం

వికారాబాద్: ఆధ్యాత్మిక సేవామండలి ఆధ్వర్యంలో విశ్వకల్యాణం కోసం గత 14 సంవత్సరాలుగా వికారాబాద్ కేంద్రంగా రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు.పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన రుద్రాభిషేకం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 30రోజులుగా కొనసాగుతున్న మహాన్యాస రుద్రాభిషేకం మహోత్సవ ముగింపు కార్యక్రమం నేడు(ఆదివారం) రామ మందిరంలో ఉంటుందన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం


పరిగి: పాఠశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఘట్‌కేసర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గురుకుల సంక్షేమ హాస్టళ్లలో జరుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన పాఠశాలల బంద్ ఘట్‌కేసర్‌లో విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ తదితర వామపక్ష విద్యార్థి సంఘాల పాఠశాలల బంద్ పిలుపుతో ప్రైవేట్ పాఠశాలలకు ముందుగానే సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలను ఆయా విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. అనంతరం ఘట్‌కేసర్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు మహేష్, అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడంతో విద్యారంగ సమస్యలపై సమీక్షలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సందీప్, అయాన్, వినయ్, సావన్, సంతోష్, అమీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం కలుషితం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను పాటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. కార్మికులకు వేతనాలూ ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరు: ఫుడ్‌పాయిజన్ ఘనటలపై సమగ్ర విచారణ చేపట్టాలని, నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొంటూ శనివారం తాండూరు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల మృతికి కారణం ప్రభుత్వమే

ఘట్‌కేసర్: గురుకుల సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మృతికి ప్రభుత్వమే కారణమని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు శ్యామ్‌కిరణ్ ఆరోపించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనాపూర్ రోడ్డులో గల మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ హాస్టల్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలంలో గురుకుల సంక్షేమ హాస్టళ్లలో 51మంది మృతిచెందారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులకు కనీస భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సచిన్, భాను, మనీష్, సంతోష్, కార్తీక్, ప్రణయ్, ఉపేందర్, జీవన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొంరాస్‌పేట్: మండలంలోని బురాన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పరిసర గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణ వెడల్పును తగ్గించాలి

శామీర్‌పేట: రాజీవ్‌రహదారి తూంకుంట వద్ద రోడ్డు విస్తరణ వెడల్పును తగ్గించాలని తూంకుంటకు చెందిన బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు, ఇళ్లను కోల్పోతున్న బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బీజేపీ జిల్లా నాయకుడు కాసుల సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్ తూంకుంట పరిధిలో రాజీవ్‌రహదారి విస్తరణలో ఇళ్లను, షాపులను కోల్పోతున్న బాధితులు, బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

పిల్లలు ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలి

తాండూరు: పిల్లలు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలని రాష్ట్ర సైకాలజికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ కరీం సూచించారు. తులసీగార్డెన్‌లో శనివారం విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేదిశగా నిర్వహించిన మనోవైజ్ఞానిక ప్రదర్శనలో ప్రసంగించారు.

అవినీతిని అంతం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్: అవినీతిని అంతం చేయడానికి ప్రతీఒక్కరు కృషిచేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ అన్నారు. పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో శనివారం లింగాపూర్ తండాలోని కమ్యూనిటీ హాల్‌లో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఘనాపూర్ మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బంట్వారం(కోట్‌పల్లి): కోట్‌పల్లి మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన విశ్వంపంతులు తండ్రి లింగయ్యస్వామి బుధవారం ఆకస్మికంగా మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, మండల యూత్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, మహబూబ్ ఉన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలోని తూంకుంటలో, దేవరయాంజాల్‌లోని పల్లెదవాఖానాలో 1న ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు.

కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన

పూడూరు: చెన్‌గోముల్‌లో జిల్లా కళాజాత బృందంతో ఎస్ఐ మధుసూదనరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.శనివారం రాత్రి గ్రామంలో కళాజాత బృందం సైబర్ క్రైం, డయల్-100, ట్రాఫిక్ నియమాలపై వివరించింది.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కులకచర్ల: ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం సతీశ్‌కుమార్ బహుమతులు అందించారు.

ఫార్మా భూసేకరణ రద్దు చేయడం హర్షణీయం

కొడంగల్/బొంరాస్‌పేట్: ప్రభుత్వం ఫార్మా కంపెనీ భూ సేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయడం హర్షణీయమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య, బుస్స చంద్రయ్య, కె.శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు కొత్తూర్ చంద్రయ్య శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం

కులకచర్ల: విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయమని గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడలకు ఎంపిక కావడంతో వారిని పాఠశాల ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

యాలాలకు అధిక నిధులు కేటాయించాలి

యాలాల: మండలానికి అధిక నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మండలసీనియర్ నాయకులు జక్కపల్లి అమృతయ్య కోరారు. శనివారం ఆయన తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలిసి మంత్రి సీతక్కను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాలాల మండలానికి అధిక నిధులు కేటాయించాలని సీతక్కను కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బషీరాబాద్: మండలంలోని ఎక్మాయికి చెందిన మోహన్‌రెడ్డి(రైతు) శనివారం వేకువజామున ఇంట్లో ఆకస్మికంగా మృతి చెందాడు. విషయాన్ని సొసైటీ డైరెక్టర్ నారాగోపాల్‌రెడ్డి ద్వారా తెలుసుకున్న చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి డైరెక్టర్, సొసైటీ అధికారులతో కలిసి అంత్యక్రియల నిమిత్తం రూ.9వేలు అందజేశారు.

ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

మర్పల్లి: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని వికారాబాద్ పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్‌కుమార్ అన్నారు. మండలంలో ఏఈగా పనిచేస్తున్న శ్రావణ్ కుమార్ శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో ఎంపీడీవో కార్యాలయంలో సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి ఎంపీడీవో రాజమల్లయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్, మండల అధ్యక్షుడు సురేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా..

(5వ పేజీ తరువాయి)

బారిన పడ్డ వారికి పరీక్షలు నిర్వహించడమే కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు కౌన్సిలింగ్ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఏశస్త్ర చికిత్స నిర్వహించాల్సి వచ్చినా ముందుగా హెచ్‌ఐవీ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈపరీక్షల్లో ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించకున్నా ఈవైరస్ బారిన పడినట్లు వెలుగు చూస్తున్న ఘటనలు ఉన్నాయి. పెరిగిన పరీక్షలతో హెచ్‌ఐవీ బారిన పడినట్లు గుర్తించిన వారిసంఖ్య పెరుగుతోంది.

రోగులకు ప్రత్యేక సేవలందిస్తున్న ఐసీటీసీ

మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఐసీటీసీ(ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్ సెంటర్)ను ప్రారంభించారు. ఈ సెంటర్‌లో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించి పాజిటివ్ వచ్చిన వారికి వైద్య పరమైన సేవలు అందిస్తున్నారు. ముందుగా గాంధీ అసుపత్రిలో ఆరునెలల పాటు వైద్య సేవలు అందించిన అనంతరం స్థానిక ఐసీటీసీ ద్వారా మందులు అందజేస్తున్నారు. ప్రస్తుతం ఈ సెంటర్ ద్వారా ప్రతీ నెల 272 మందికి మందులు సరఫరా చేస్తున్నారు. అలాగే హెచ్‌ఐవీ సంక్రమించిన గర్భిణులకు కాన్పు చేయడంతో పాటు గర్భంలో ఉన్న శిశువుకు తల్లిద్వార హెచ్‌ఐవీ సంక్రమించకుండా కావాల్సిన ముందులను అందజేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



హెచ్‌ఐవీ సంక్రమించిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని పెంచి, జీవనం కొనసాగించే విధంగా తీర్చిదిద్దుతున్నాం. నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో కళాజాత చేపడుతున్నాం. లారీలు, లేబర్‌అడ్డాల వద్ద కండోమ్‌లను అందుబాటులో ఉంచుతున్నాం - ఎన్. గోవిందరెడ్డి , ఐసీటీసీ కౌన్సిలర్, మేడ్చల్